### ఆడిటోరియం నిర్మాణ పనులు పూర్తి చేయండి

ఎమ్మెల్యే శంకర్‌కు వినతి పత్రం అందజేస్తున్న మినిస్ట్రీ ఆఫ్ కల్చర్ గవర్నమెంట్ ఆఫ్ ఇండియా సభ్యుడు వీరంగయ్య, కళాకారులు

షాద్‌నగర్‌రూరల్, జూన్ 27: షాద్‌నగర్ పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయం సమీపంలో నూతనంగా నిర్మిస్తున్న ఆడిటోరియం నిర్మాణ పనులను త్వరితగా పూర్తి చేయాలని కోరుతూ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు వినతి పత్రం అందజేసినట్లు మినిస్ట్రీ ఆఫ్ కల్చర్ గవర్నమెంట్ ఆఫ్ ఇండియా సభ్యుడు టీ.వీ రంగయ్య తెలిపారు. కళాకారులు తమ కళా ప్రదర్శనలు ప్రదర్శించుకోవడానికి సరైన కళావేదిక లేకపోవడంతో అనేక ఇబ్బందులు పడుతున్నారని, ఆడిటోరియం నిర్మాణ పనులు శరవేగంగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కళాకారుల అభివృద్ధికి తోడ్పాటును అందించి మరింత ప్రోత్సహించాలన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ త్వరగా ఈ నిర్మాణ పనులు పూర్తయ్యేలా చూస్తామన్నారు. ఎమ్మెల్యేకు కళాకారులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కళాకారులు రమేశ్‌చారి, రవీందర్, శివ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

### చిన్నారులకు పౌష్టికాహారం అందివ్వాలి

ఆరుట్ల సెంటర్‌లో చిన్నారి బరువును పరిశీలిస్తున్న సీడీపీవో

మంచాల, జూన్ 27: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులకు అందజేస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఇబ్రహీంపట్నం సీడీపీవో శాంతి శ్రీ అన్నారు. గురువారం మంచాల మండలం ఆరుట్ల అంగన్‌వాడీ కేంద్రంలో 5సంవత్సరాల లోపు ఉన్న పిల్లలకు ఎత్తు, బరువును ఆమె గుర్తించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిల్లల ఎత్తు, బరువు వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేయాలని, బరువు తక్కువగా ఉన్న వారిని గుర్తించి వారికి తగిన పోషకాహారాన్ని అందించేందుకు కృషి చేయాలన్నారు. ఆమె వెంట సూపర్‌వైజర్ కల్పన, అంగన్‌వాడీ టీచర్లు ఉన్నారు.

### పాఠశాలల బలోపేతానికి కృషి చేయాలి

మొయినాబాద్, జూన్27:ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి దాతలు స్వచ్ఛందంగా ముందుకొచ్చి సహకరించాలని ఎంపీటీసీ పట్నం రాంరెడ్డి అన్నారు. మండల పరిధిలోని శ్రీరాంనగర్ ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు నగరానికి చెందిన మాణిక్‌రావు అనే దాత స్వచ్ఛందంగా ముందుకొచ్చి నోట్ పుస్తకాలను గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ మాట్లాడుతూ విద్యార్థుల విద్యను ప్రోత్సహించడానికి దాతలు ముందుకు రావాలని, అప్పుడే ప్రభుత్వ పాఠశాలలు ఎంతో అభివృద్ధి చెందుతాయని అన్నారు. వారి వెంట పాఠశాల ప్రధానోపాధ్యాయులు జంగయ్య, ఉపాధ్యాయులు ప్రవీణ్, ఉమాదేవి, అలివేలు, డాక్టర్ అనంతయ్య, తదితరులు పాల్గొన్నారు.

### ఆలయంలో వేలం నిర్వహణ

వేలం పాట నిర్వహిస్తున్న దేవాదాయశాఖ అధికారులు

కడ్తాల్, జూన్ 27: మండల పరిధిలోని మైసిగండి మైసమ్మ తల్లి ఆలయం ఆవరణలో గురువారం, జిల్లా దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో శాశ్వతేయా మొక్కుబడుల రసీదు రుసుము వసూలు, పూలు, పూజ సామగ్రి విక్రయించేందుకు బహిరంగ వేలం నిర్వహించారు. శాశ్వతేయా మొక్కుబడుల రసీదు రుసుము వసూలు 2024-25 సంవత్సరానికిగాను ఆలయ ఆవరణలో జరిగిన ఈ వేలం పాటలో మొత్తం ముగ్గురు పాల్గొనగా, మైసిగండి గ్రామానికి చెందిన దేపావత్ రవి రూ.25,15,000 లక్షలకు పాట పాడి దక్కించుకున్నాడు. అలాగే పూలు, పూజ సామగ్రి విక్రయించేందుకు మైసిగండి గ్రామానికి చెందిన రాజేశ్ రూ.15,41,000 లక్షలకు దక్కించుకున్నట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ ప్రణీత్‌కుమార్, ఆలయ ఫౌండర్ ట్రస్టీ శిరోలీ పంతూనాయక్, ఈవో స్నేహలత, ఆలయ నిర్వాహకుడు భాస్కర్‌నాయక్, అమ్రునాయక్, పాండూనాయక్, గణేశ్‌గౌడ్, సుమన్‌నాయక్,, ఆలయ ఉద్యోగ, అర్చకులు యాదగిరి, బోడి యానాయక్, కృష్ణ, చంద్రయ్య, రాములు, దేవేందర్, రమాదేవి, శ్రీనివాసులు, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

పదిన్నర గంటలకు ఖాళీగా దర్శనమిస్తున్న వైద్యుల కుర్చీలు

వైద్యుల కోసం ఎదురు చూస్తున్న రోగులు

## వైద్యుల కోసం ఎదురుచూపులు..

- సమయపాలన పాటించని డాక్టర్లు
- వైద్యం కోసం రోగుల నిరీక్షణ
- సీహెచ్‌సీగా మారినా మారని తీరు ..
- కొరవడిన వైద్యాధికారుల పర్యవేక్షణ

యాచారం, జూన్27: మండల కేంద్రంలోని ప్రభుత్వ దవాఖాన పీహెచ్‌సీ నుంచి సీహెచ్‌సీగా పేరు మారిందే తప్పా.. వైద్య సేవలు, వైద్యుల తీరు మాత్రం అస్సలు మారలేదు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి సామాజిక ఆరోగ్య కేంద్రంగా అప్‌గ్రేడ్ కావడంతో దవాఖాన జిల్లా వైద్య ఆరోగ్య శాఖ నుంచి రాష్ట్ర వైద్య విధాన పరిషత్ ఆధీనంలోకి వెళ్లింది. అయినప్పటికీ దవాఖానలో వైద్య సేవలు మాత్రం అధ్వానంగా మారాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. ముఖ్యంగా వైద్యులు సమయపాలన పాటించడం లేదని స్థానికులు పేర్కొంటున్నారు. సాయంత్రం పూట దవాఖానలో కేవలం స్టాఫ్ నర్సు మాత్రమే అందుబాటులో ఉంటున్నారని, ఎమర్జెన్సీ కేసులకు ఇబ్రహీంపట్నానికి తరలిస్తున్నారని రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**శిథిలావస్థలో భవనం..**

యాచారం ప్రభుత్వ దవాఖాన నేడు పూర్తిగా శిథిలావస్థకు చేరుకున్నది. ఇప్పటికే పైకప్పు పెచ్చులూడిపోయి సీకులు తేలాయి. కిటికీలకు తలుపులు లేకపోవడంతో వర్షం నీరు దవాఖానలోకి వస్తుంది. నూతన భవన నిర్మాణానికి గత ప్రభుత్వం శంకుస్థాపన చేసినప్పటికీ ప్రస్తుతం అది శిలాఫలకానికే పరిమితమైంది. ప్రభుత్వం స్పందించి నూతన భవన నిర్మాణాన్ని వెంటనే ప్రారంభించాలని యాచారం జడ్పీటీసీ చిన్నోళ్ల జంగమ్మ ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు.

## కస్తూర్బా గాంధీ విద్యాలయాన్ని ప్రారంభించాలి

కడ్తాల్, జూన్ 27: మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన కస్తూర్బాగాంధీ విద్యాలయాన్ని వెంటనే ప్రారంభించాలని ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు క్యామ శ్రీకాంత్ డిమాండ్ చేశారు.

తహసీల్దార్ ముంతాజ్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శ్రీకాంత్

కేజీబీవీ పాఠశాలను ప్రారంభించాలని కోరుతూ, గురువారం తహసీల్దార్ ముంతాజ్‌ని ఏబీవీపీ నాయకులు కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ మండల కేంద్రం సమీపంలో చేపట్టిన కస్తూర్బా గాంధీ భవనం నిర్మాణ పనులు ఇది వరకే పూర్తి కావడం జరిగిందని తెలిపారు. భవనాన్ని ప్రారంభించకపోవడంతో నిరుపేద విద్యార్థులు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి పాఠశాలను ప్రారంభించి, విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. కేజీబీవీనీ ప్రారంభించని పక్షంలో ఏబీవీపీ ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఆందోళన నిర్వహిస్తామని నాయకులు హెచ్చరించారు. కార్యక్రమంలో కోనేటి అజిత్, రమేశ్, అఖిల్, గణేశ్, రామ్ పాల్గొన్నారు.

## బస్ సర్వీసుల్లో సమయవేళలు పాటించాలి

డీఎంకు వినతిపత్రం అందజేస్తున్న ఎంపీటీసీ వెంకటేశ్‌యాదవ్ తదితరులు

పెద్దఅంబర్‌పేట, జూన్ 27: అబ్దుల్లాపూర్‌మెట్ మండలం తారామతిపేట గ్రామంలోని విద్యార్థుల బడి వేళలకు అనుగుణంగా బస్సులు నడుపాలని గ్రామ ఎంపీటీసీ చేగూరి వెంకటేశ్ కోరారు. ఈ మేరకు హయత్‌నగర్ బస్సు డిపో-1 మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు. తారామతిపేట, గౌరెల్లి, బాచారం గ్రామాల్లోని దాదాపు 400 మంది విద్యార్థులు పాఠశాలలు, కాలేజీల కోసం హయత్‌నగర్‌తోపాటు దిల్‌సుఖ్‌నగర్ తదితర ప్రాంతాలకు వెళ్తుంటారని తెలిపారు. సమయానికి బస్సులు లేక విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. ఒకే బస్సు ఉండటంతో విపరీతమైన రద్దీ ఉంటున్నదన్నారు. ఉదయం 7 నుంచి 9 గంటల మధ్య బస్ సర్వీసులు కొనసాగించేందుకు, తిరిగి వచ్చేందుకు సాయంత్రం 4 నుంచి రాత్రి 7 గంటల మధ్య ఈ సర్వీసును హయత్‌నగర్ నుంచి తారామతిపేట, బాచారానికి నడుపాలని కోరారు. వినతి పత్రం అందజేసిన వారిలో వేముల కృష్ణ, కె. వెంకటేశ్ తదితరులు ఉన్నారు.

## మైనింగ్ తవ్వకాల అనుమతులు రద్దు చేయాలి

ప్రజాభిప్రాయసేకరణలో అంతారం గ్రామస్తులు

అంతారంలో ప్రజాభిప్రాయసేకరణలో పాల్గొన్న గ్రామస్తులు, అధికారులు

చేవెళ్ల రూరల్, జూన్ 27 : మైనింగ్ తవ్వకాలతో తమ ప్రాంతం పూర్తిగా నష్టపోతున్నదని, పర్యావరణం, ప్రజలకు హాని కలుగుతున్నదని, వాటి అనుమతులు రద్దు చేయాలని అంతారం గ్రామ ప్రజలు ముక్త కంఠంతో వ్యతిరేకించారు. గురువారం చేవెళ్ల మండల పరిధిలోని అంతారం గ్రామ సమీపంలోని ఎస్‌ఆర్ మినరల్స్ సంస్థ పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ కార్యక్రమం పొల్యూషన్ బోర్డు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శ్రీవాత్సవ్, ఆర్డీవో సాయిరాం, ఎంపీడీవో హిమబిందు, తహసీల్దార్ కృష్ణయ్య సమక్షంలో నిర్వహించారు. ఈ సందర్భంగా అంతారం గ్రామానికి చెందిన ప్రజలు మైనింగ్ నిర్వహణతో గ్రామానికి ఒరిగిందేమీ లేదని, పర్యావరణం పూర్తిగా దెబ్బతింటుందని, అనుమతులు ఇవ్వొద్దని అధికారులు విన్నవించారు. కొద్దిసేపు ప్రజలు ఆందోళన చేయడంతో పోలీసులు, అధికారులు సర్దిచెప్పడంతో వెనుదిరిగారు. కార్యక్రమంలో రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సభ్యుడు సత్యనారాయణరెడ్డి, అంతారం మాజీ సర్పంచ్ సులోచనాఅంజన్‌గౌడ్, పంచాయతీ కార్యదర్శి అనూష, మాజీ ఉపసర్పంచ్ అనసూయ, కాంగ్రెస్ నాయకుడు వెంకటేశ్ బాబు, సీఐటీయూ నాయకుడు దేవేందర్, గ్రామస్తులు వీరాంజనేయులు, నవీన్, వీరస్వామి, నగేశ్, మాణిక్యం, పాషా, రవికిషోర్, వెంకటస్వామి, రాము, తరుణ్, తదితరులు పాల్గొన్నారు.

## ఫీజుల దోపిడీని నియంత్రించాలి

దీక్ష చేస్తున్న యువసత్తా యూత్ అధ్యక్షుడు లక్ష్మణ్‌కుమార్

షాద్‌నగర్‌టౌన్, జూన్ 27: ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని, ఈ దోపిడీని నియంత్రించాలని షాద్‌నగర్ యువసత్తా యూత్ అధ్యక్షుడు లక్ష్మణ్‌కుమార్ గురువారం మండల పరిషత్ కార్యాలయం సమీపంలో దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నర్సరీ నుంచే వేలాది రూపాయలతో మొదలై పదో తరగతి వరకు లక్షల రూపాయలను విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి వసూలు చేస్తున్న ప్రైవేట్, కార్పొరేట్ యాజమాన్యంపై సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అధిక ఫీజులను నియంత్రించాలంటూ వివిధ విద్యార్థి సంఘాలు పలుమార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అధిక ఫీజులను వసూలు చేయడమే కాకుండా ప్రభుత్వ నిబంధనలను పాటించడం లేదన్నారు. ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు విద్యను వ్యాపారంగా చేశాయని ఆరోపించారు. అడ్మిషన్లు, పుస్తకాలు, ఆన్‌లైన్ అంటూ అదనంగా ఫీజును వసూలు చేస్తూ విద్యను వ్యాపారంగా మార్చాయని, యజమాన్యంపై విద్యాశాఖ అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఫీజులను తగ్గించాలంటూ ఆయన చేపట్టిన దీక్షకు పలువురు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

## నర్సరీల్లో మొక్కలను సంరక్షించాలి

పాఠశాలలో రికార్డులను పరిశీలిస్తున్న మండల ఎంపీడీవో మాధురీ

ఆమనగల్లు, జూన్ 27: నర్సరీల్లో పెంచుతున్న మొక్కలు ఎండిపోకుండా ఎప్పటికప్పుడు నీరందించాలని మండల ఎంపీడీవో మాధురి అన్నారు. మండల పరిధిలోని కోనాపూర్ గ్రామపంచాయతీలో నర్సరీని గురువారం ఆమె పరిశీలించి నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. అనంతరం గ్రామంలోని అంగన్‌వాడీ, అమ్మ ఆదర్శ పాఠశాల పనులను పరిశీలించారు. నిర్ణిత గడువులోగా పనులు పూర్తి చేయాలని నిర్వాహకులను ఆదేశించారు. ఆనంతరం ఆమనగల్లు మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేసి విద్యార్థులకు వండిన ఆహారాన్ని పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థినులకు నాణ్యమైన విద్య, పౌష్టికాహారం అందించడంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవన్నారు. ఆమె వెంట పాఠశాల ఎస్‌వో పద్మజ్యోతి, ఉపాధ్యాయులు, ఏఎన్‌ఏం సల్మా ఉన్నారు.

## గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు

గ్రామస్తులకు నిధుల ప్రొసీడింగ్ కాపీని అందజేస్తున్న జడ్పీటీసీ

మంచాల, జూన్ 27: గ్రామాల అభివృద్ధి కోసం జిల్లా పరిషత్ నుంచి ప్రత్యేక నిధులు కేటాయించి అభివృద్ధికి బాటలు వేస్తామని మంచాల జడ్పీటీసీ మర్రి నిత్య అన్నారు. మంచాల మండలం బండలేమూరు గ్రామంలో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం జిల్లా పరిషత్ నిధులు నుంచి మంజూరైన రూ. 5లక్షలకు సంబంధించి ప్రొసీడింగ్‌ను గురువారం జడ్పీటీసీ గ్రామస్తులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రామంలో నెలకొన్న సమస్యలను ప్రజాప్రతినిధులు తమ దృష్టికి తీసుకువచ్చిన వెంటనే వాటి పరిష్కారానికి నిధులు కేటాయించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో బండలేమూరు గ్రామస్తులు శ్రీనూనాయక్, కిషన్‌నాయక్, మోహన్‌నాయక్ పాల్గొన్నారు.

## ఆమనగల్లు ఎస్ఐగా శ్రీనివాసులు బాధ్యతల స్వీకరణ

ఎస్ఐగా బాధ్యతలు స్వీకరిస్తున్న శ్రీనివాసులు

ఆమనగల్లు, జూన్ 27 : ఆమనగల్లు మండల నూతన ఎస్ఐగా గురువారం శ్రీనివాసులు బాధ్యతలు చేపట్టారు. గతంలో ఆమనగల్లు ఎస్ఐగా బాధ్యతలు నిర్వహించిన బాలరాంనాయక్ కేపీహెచ్‌బీ పోలీస్‌స్టేషన్‌కు ఎస్ఐగా బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో కేపీహెచ్‌బీ పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐగా విధులు నిర్వహించిన శ్రీనివాసులు బదిలీపై ఆమనగల్లుకు వచ్చారు. ఎస్ఐగా బాధ్యతలు తీసుకున్న అనంతరం ఎస్ఐ శ్రీనివాసులు మాట్లాడుతూ మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేసానన్నారు.

## మహనీయులను ఆదర్శంగా తీసుకోవాలి



లైబ్రరీకి పుస్తకాలు అందజేస్తున్న ఎస్సీ రిజర్వేషన్ పరిరక్షణ సమితి అధ్యక్షుడు, నాయకులు

కడ్తాల్ (తలకొండపల్లి), జూన్ 27: దేశ స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్న సమరయోధుల జీవిత చరిత్రను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని ఎస్సీ రిజర్వేషన్ పరిరక్షణ సమితి అధ్యక్షుడు జనుకుంట్ల భాస్కర్ అన్నారు. గురువారం తలకొండపల్లి మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల లైబ్రరీకి, తన సొంత నిధులతో సమకూర్చిన 80 మంది స్వాతంత్ర సమర యోధుల జీవిత చరిత్రకు సంబంధించిన పుస్తకాలను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా భాస్కర్ మాట్లాడుతూ మహనీయులను ఆదర్శంగా తీసుకోవడంతో పాటు పుస్తకాలు చదవడం ద్వారా విద్యార్థుల్లో సామాజిక స్పృహ, దేశభక్తి పెంపొందుతాయని తెలిపారు. కార్యక్రమంలో ఎస్సీ రిజర్వేషన్ పరిరక్షణ సమితి జాతీయ కోశాధికారి బలరాం, వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకటేశ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సింహ, జిల్లా ప్రధాన కార్యదర్శి వినోద్, జిల్లా సలహాదారులు రమేశ్, రాజు, మల్లేశ్, శివ, శ్రీకాంత్, దేవేందర్, మనోహర్, శ్రీను, భరత్, రామకృష్ణ, శ్రీశైలం, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలకు ప్రింటర్ అందజేత

చేవెళ్ల రూరల్, జూన్ 27 : ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి దాతలు ముందుకు వచ్చి చేయూతనిస్తున్నారు. చేవెళ్ల మండల పరిధి కందవాడ జడ్పీహెచ్ఎస్‌కు న్యాయవాది, బీజేపీ మండల ఉపాధ్యక్షుడు కృష్ణగౌడ్ ప్రింటర్‌ను ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా కృష్ణగౌడ్‌ను పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కోవాలక్ష్మి, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నరేంద్ర బోగం, ఉపాధ్యాయ బృందం ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు దర్శన్‌గౌడ్, విజయ్‌కుమార్, రమణారెడ్డి, నాయకుడు కృష్ణమోహన్ పాల్గొన్నారు.

## ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

మొయినాబాద్: పరీక్షలు చేస్తున్న వైద్యులు

మొయినాబాద్, జూన్27: మండల పరిధిలోని చిలుకూరు గ్రామంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. హైదరాబాద్ నగరంలోని అపోలో దవాఖాన నర్సింగ్ కళాశాలకు చెందిన విద్యార్థులు గురువారం ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్, నర్సింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఏ జయసుధ, అసోసియేషన్ ప్రొఫెసర్ సీహెచ్ లావణ్య, ఉపాధ్యాయులు భారతి, శ్రీవాణి, వైద్యులు శిరీష, స్నిగ్ధ పట్నాయక్, సత్యగోపాల్, నిరూపయ, విద్యార్థులు పాల్గొన్నారు.

**అబ్దుల్లాపూర్‌మెట్‌లో మెగా మెడికల్ క్యాంపు**

అబ్దుల్లాపూర్‌మెట్ : హైదరాబాద్ నాగోల్‌లోని నక్షత్ర హాస్పిటల్స్ (సూట్స్ కేర్ నెట్‌వర్క్), కసిరెడ్డి నారాయణరెడ్డి కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ రీసర్చ్ కళాశాల వారి సౌజన్యంతో గురువారం మెగా మెడికల్ క్యాంపును నిర్వహించారు. ఇందులో 500 మంది విద్యార్థులు, హెచ్‌వోడీలు, ఫ్యాకల్టీలు పాల్గొని ఉచిత షుగర్, బీపీ, బీఎంఐ పరీక్షలు చేయించుకున్నారని వారు తెలిపారు. నక్షత్ర హాస్పిటల్స్ సీఈవో అండ్ మేనేజింగ్ డైరక్టర్ డాక్టర్ సోమశేఖర్‌రెడ్డికి కళాశాల యాజమాన్యం అభినందనలు తెలిపారు. అనంతరం ఇన్ కేస్ ఆఫ్ ఎమర్జెన్సీ అనే లైఫ్ సేవింగ్ కార్డులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కళాశాల డైరక్టర్లు డాక్టర్ జయదేవరెడ్డి, డాక్టర్ ఎం. నరేంద్రకుమార్, డాక్టర్ సతీశ్ రెడ్డి, హెచ్‌వోడీలు, నక్షత్ర వైద్య బృందంతో పాటు చీఫ్ మార్కెటింగ్ ఆఫీసర్ మహబూబ్‌పాషా, సాయినాథ్, మౌనిక, ఫ్యాకల్టీలు తదితరులు ఉన్నారు.

## జూలై 3న సర్వసభ్య సమావేశం

షాబాద్, జూన్ 27: మండల సర్వసభ్య సమావేశం జూలై 3వ తేదీన నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో అపర్ణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం ఉదయం 11గంటలకు మండల పరిషత్ కార్యాలయం సమావేశ మందిరంలో స్థానిక ఎంపీపీ కోట్ల ప్రశాంతిరెడ్డి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరుగుతుందని చెప్పారు. మండలంలోని అన్ని గ్రామాల ఎంపీటీసీలు, గ్రామ పంచాయతీల ప్రత్యేకాధికారులు, ఆయా శాఖల అధికారులు సకాలంలో సమావేశానికి హాజరు కావాలని ఆమె కోరారు.

## ఆలయానికి వెండి బహూకరణ

షాద్‌నగర్‌టౌన్, జూన్ 27: షాద్‌నగర్ పట్టణంలోని శ్రీ వెంకటేశ్వరస్వామి దేవాలయానికి పట్టణానికి చెందిన మణికొండ హర్షవర్ధన్‌గౌడ్ రెండున్నర కిలోల వెండిని గురువారం పూజలు చేసిన అనంతరం బహూకరించారు. కార్యక్రమంలో మున్సిపల్ కో-ఆప్షన్ సభ్యుడు కిషోర్, స్థానికులు సాయిశ్వరరెడ్డి, భూపాల్, భాస్కర్, మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

## కల్యాణ లక్ష్మి చెక్కులు అందజేత

బడంగ్‌పేట, జూన్27: మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ సమావేశం మందిరంలో కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ చెక్కులను గురువారం మేయర్ దుర్గా దీప్‌లాల్ అందజేశారు. 24 మంది లబ్ధిదారులకు అందజేసినట్లు తెపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ మణిపాల్ రెడ్డి, కమిషనర్ చంద్రశేఖర్, కార్పొరేటర్లు తదితరులు ఉన్నారు.

## నేడు సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో యోగా

ఆర్కేపురం, జూన్ 27 : సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో సహజ యోగా ధ్యానం శుక్రవారం నిర్వహిస్తున్నామని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సహజ యోగా రాష్ట్ర కోఆర్డినేటర్ గౌరి కృష్ణ ,మాజీ కోఆర్డినేటర్ మల్లారెడ్డి తెలిపారు. గురువారం సరూర్‌నగర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. మాతాజీ నిర్మల దేవి స్థాపించిన సహజ యోగా నేడు సుమారు 170 దేశాల్లో వ్యాపించి సహజ యోగా ధ్యాన కేంద్రాలను స్థాపించబడ్డాయన్నారు. ప్రపంచవ్యాప్తంగా లక్షలాది మంది కుల మత ప్రాంత వయసుతో సంబంధం లేకుండా సహజ యోగా సాధన చేస్తూ తాము ఎదుర్కొంటున్న శారీరక, మానసిక భావోద్వేక సమస్యలను పరిష్కరించుకుంటూ ఆధ్యాత్మికతమైన సంతృప్తిని పొందుతున్నారని తెలిపారు. యోగా ద్వారా ప్రశాంతతను అందించడానికి హైదరాబాద్ రీఅలైజేషన్ టూర్‌ని నిర్వహించేందుకు ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. 500 మంది ప్రతినిధులు భారతదేశంలోని వివిధ రాష్ట్రాలతో పాటు దేశాల నుండి అతిథులు వచ్చి పాల్గొంటున్నారని పేర్కొన్నారు. ఈ నాలుగు రోజులు ఉదయం నుండి సాయంత్రం నాలుగు వరకు సహజ యోగా పరిచయ కార్యక్రమాలు స్ట్రేస్ మేనేజ్మెంట్ సెషన్‌ను వివిధ కళాశాలు, పాఠశాలలో నిర్వహించబోదున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కోఆర్డినేటర్ మల్లారెడ్డి, రామ్మోహన్‌రావు, సుబ్బిరెడ్డి, కమిటీ మెంబర్స్ సుప్రజ, సభ్యులు సునీల్ అగర్వాల్ తదితరులు పాల్గొన్నారు.

## గంటల తరబడి ట్రాఫిక్ జామ్

బడంగ్‌పేట, జూన్27: బడంగ్‌పేట, బాలాపూర్ చౌరస్తా, నాదర్‌గుల్‌లో ట్రాఫిక్ నియంత్రణ పూర్తిగా కొరవడింది. గురువారం గంటల తరబడి వాహనాల ట్రాఫిక్ జామ్ అయినా ట్రాఫిక్ పోలీసుల జాడ కన్పించలేదు. నగరంలో ఉన్న కార్పొరేట్ పాఠశాలలు, కళాశాలలు ఇబ్బడి ముబ్బడిగా రావడంతో ప్రైవేట్ బస్సులు ఎక్కువయ్యాయి. ఉద్యోగాలకు పోవలసిన వారికి సమయం వృదా అవుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రయాణికులు 100 డయల్ చేసినా స్పందన లేదని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గురువారం బడంగ్‌పేట చౌరస్తాలో గంటల తరబడి ట్రాఫిక్ జామ్ కావడంతో స్థానికులే ట్రాఫిక్ క్లియర్ చేసి పంపించారు.

## నందిహిల్స్ కాలనీలో అక్రమ నిర్మాణాలు కూల్చివేత

బడంగ్‌పేట, జూన్27: మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని నందిహిల్స్ కాలనీలో ఉన్న షెడ్డును తీవ్ర ఉద్రిక్తతల మధ్యన మున్సిపల్ కమిషనర్ చంద్రశేఖర్ ఆదేశాల మేరకు టౌన్ ప్లానింగ్ అధికారి మహేశ్ గురువారం కూల్చివేయించారు. కోర్టు ఆదేశాల మేరకు షోకాజ్ నోటీస్ జారీ చేసిన తర్వాత కూల్చివేయడం జరిగిందని కమిషనర్ పేర్కొన్నారు. భారీ పోలీస్ బందో బస్తు తో కూల్చివేసినట్లు తెలిపారు. కోర్టు ఇచ్చిన డైరెక్షన్ ప్రకారం కూల్చివేసిన రిపోర్టు కోర్టుకు పంపవలసి ఉందన్నారు. కూల్చివేయడానికి వచ్చిన అధికారులతో షెడ్డు యజమానులు వాగ్వాదానికి దిగారు. అనుమతులు లేకుండా మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్‌లో అక్రమ నిర్మాణాలు వెలుస్తుంటే పట్టించుకోని అధికారులు చిన్న షెడ్డును కూల్చడంపై వారు అభ్యంతరం వ్యక్తం చేశారు. అధికారుల అండదండలతో అడ్డుగోలుగా నిర్మాణాలు జరుగుతున్నాయన్నారు. బాలాపూర్ చౌరస్తాలో అనుమతులు లేకుండా షెడ్లు వెలిసినా ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆరోపిస్తున్నారు. చెరువుల పరిధి, ప్రభుత్వ భూమిలో నిర్మాణాలను ఎందుకు కూల్చడం లేదన్నారు. సెల్లార్‌తో సహా ఆరు ఏడు అంతస్